నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: ఆంజనేయనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ భీమలింగం ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆంజనేయనగర్ చౌరస్తా, జనతానగర్, మహిళా మండలి భవనం ప్రాంతాల్లో, అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంతాల్లో, ఆంజనేయ నగర్ రోడ్డు నెంబర్ 6, 7, 9, విశాల్ మార్ట్ వెనుక ప్రాంతం, మున్సిపల్ కార్యాలయ ప్రాంతాలు, చైతన్య యూత్ కార్యాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు శివరామాంజనేయ ఆలయంలో పూజలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ మోతీనగర్ ఎక్స్‌టెన్షన్ కబీర్‌నగర్‌లోని శివరామాంజనేయ ఆలయంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు అమావాస్య సందర్భంగా ప్రత్యంగిరా సమేత కాలభైరవ స్వామికి విశేష అభిషేకం, కూష్మాండ దీపారాధన నిర్వహించనున్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 12.30 గంటలకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

దుప్పట్ల పంపిణీ


దుప్పటి అందజేస్తున్న వెంకటరెడ్డి తదితరులు

ఆల్విన్‌కాలనీ: చలికి అలమటిస్తున్న నిరుపేదలకు పలువురు దాతలు దుప్పట్లు అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. హెచ్‌ఎంటీ శాతవాహన నగర్ వాకింగ్ గ్రూప్ పెద్దలు, బీవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ బొమ్మారెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున ఫుట్‌పాత్‌ల మీద, విశ్రాంతి భవనాల్లో, ఇతర షెల్టర్లలో చలిలో కనీసం దుప్పట్లు కూడా లేకుండా నిద్రిస్తున్న నిరుపేదలకు వెంకటరెడ్డి మిత్ర బృందంతో తిరిగి దుప్పట్లు కప్పి వారి పట్ల ప్రేమాభిమానాలు చూపుతున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, రిటైర్డ్ ఎస్పీ సురేందర్ రెడ్డి, వాకింగ్ గ్రూప్ సభ్యులు రాధాకృష్ణ, వాకింగ్ గ్రూప్ ప్రెసిడెంట్ రామ్మోహన్‌రావు, జగన్మోహన్ రావు, హనుమంతరావు, బీవీఆర్ యూ త్ ప్రెసిడెంట్ శ్యామ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సత్య సాయి సేవా సమితి వార్షికోత్సవం


వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ కమిటీ హాల్‌లో శ్రీ సత్యసాయి సేవా సమితి వెంగళ రావు నగర్ శాఖ 7వ వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాలవికాస్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు ఎంత గానో ఆకట్టుకున్నాయి. సత్యసాయి సేవా సమితి వార్షిక వేడుకలు ఘనంగా ముగిశాయని శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్యాత్మిక సమన్వయకర్త ఎం.ఎల్.ఎస్ స్వామి, కన్వీనర్ చంద్రశేఖర్‌రావు తెలిపారు.

వడ్డే ఓబన్న సంస్మరణ సభ

కూకట్‌పల్లి: ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న సంస్మరణ కార్యక్రమం ఆదివారం ఫతేనగర్ వడ్డెర సంఘం, మధు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ఓబన్న జయంతి వేడుకలను జనవరిలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు సాగర్ కృష్ణ, జనరల్ సెక్రటరీ దశరథ, బత్తుల లచ్చన్న, లక్ష్మయ్య, కుక్కల రమేష్, అయ్యాజ్, క్యాషియర్ రాజు, శ్రీనివాస్, రాజు, గిరి, మద్దూరి రాము పాల్గొన్నారు.

కాలనీల్లో వసతుల కల్పనకు ప్రాధాన్యం

శేరిలింగంపల్లి: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తానని పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ తెలిపారు. నల్లగండ్ల హుడా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఆయన నివాసంలో కలిసి కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లతో పాటు మంచినీటి వ్యవస్థ, వీధిదీపాల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు గాంధీ సానుకూలంగా స్పందించారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. వీధి దీపాల ఏర్పాటుతోపాటు మంచినీటి వ్యవస్థను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానన్నారు. త్వరలో కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలిస్తానని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మంత్రిప్రగడ సత్యనారాయణరావు, ప్రతినిధులు ప్రభాకర్ రెడ్డి, వర్మ, నవీన్, చంద్ర, కృష్ణ, విజయ్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

- చిన్నపాటి గాలులకే తీగలు తగిలి షార్ట్ సర్క్యూట్
- అధికారులు స్పందించాలని కాలనీల విజ్ఞప్తి



ఇళ్లకు ఆనుకొని ఉన్న విద్యుత్ వైర్లు

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ తీగలు ఇళ్ల గుమ్మాలకు, శ్లాబులకు దగ్గరలో వేలాడుతుండటంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. కూకట్‌పల్లి, ఆల్విన్ కాలనీ ఫేజ్ 2 ఏర్పడినప్పుడు విద్యుత్ స్తంభాలను నాటి వైర్లను ఏర్పాటు చేశారు. విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన వైర్లు సాగిపోయి వేలాడుతుండటంతో విద్యుత్ అధికారులు వాటికి సపోర్టుగా ప్లాస్టిక్ పరికరాలను ఏర్పాటు చేశారు. అవి కూడా పాతపడిపోవటంతో విద్యుత్ వైర్లు చేతికి అందే అంత ఎత్తులో వేలాడుతూ ఉన్నాయి. చినపాటి గాలులకే ఒకదానికి ఒకటి తగిలి షార్ట్ సర్క్యూట్ జరిగి ఇళ్లలోని ఎలక్ట్రికల్ వస్తువులు బూడిదవుతున్నాయని, ఆస్తి నష్టం వాటిల్లుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. అదే విధంగా విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు ఏర్పాటు చేయటంతో స్తంభానికి గుట్టలు గుట్టలుగా వేలాడుతున్నాయి. గత వేసవిలో విద్యుత్ వైర్ల మంటలకు కేబుల్ వైర్లు కూడా అంటుకుని ప్రమాదాలు చోటు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. గత సంవత్సరం కొన్ని ప్రాంతాల్లో చిన్న గా ఉన్న స్తంభాలను తొలగించి పెద్ద స్తంభాలకు విద్యుత్ వైర్లను ఏర్పాటు చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో వదిలివేయటంతో రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని గాలులకు, ఎండకు ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

అయ్యప్ప స్వామి మండల పూజ


పూజలో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్ గౌడ్

మూసాపేట: మూసాపేట జనతానగర్‌లో అయ్యప్ప స్వామి ఆలయంలో మండల పూజా మహోత్సవాన్ని ఆలయ కమిటీ, గురుస్వాముల ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబూరావు, ఐలయ్య, శ్రీనివాస్, జిల్లా జితేంద్రావు, పవన్ శర్మ పంతులు, సప్పిడి శ్రీనివాస్, సుశీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫతేనగర్ శివాలయంలో..

బాలానగర్: ఫతేనగర్ శివాలయంలో మలయాళీయుల ఆధ్వర్యంలో హరిహరపుత్ర అయ్యప్ప స్వామి మండల పూజను ఘనంగా నిర్వహించారు.


పూజలో పాల్గొన్న భక్తులు

మలయాళీలు ఆనవాయితీగా నిర్వహించే పరా కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ హాజరై అయ్యప్ప స్వామి ఆశీర్వాదం తీసుకున్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్‌లో డ్రైనేజీ, మంజీరా వాటర్ రోడ్లపై ప్రవహిస్తున్నదని కాలనీ వాసులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదివారం కాలనీలో పర్యటించి డ్రైనేజీ సమస్య గుర్తించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఇళ్లలో మంజీరా వాటర్ పైపులైన్‌లకు ఆన్, ఆఫ్ అమర్చి తాగునీరు వృథాగా పోకుండా చూడాలని కాలనీ వాసులకు సూచించారు. కార్యక్రమంలో భాస్కర్, షౌకత్ అలీ


సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు

మున్నా, అగ్రవాసు, రవీందర్, ప్రభాకర్, అజామ్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నేతలు


యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడితో డివిజన్ నాయకులు

మూసాపేట: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్ బాధ్యతలు స్వీకరించడంతో ఆదివారం మూసాపేట నుంచి పలువురు కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సలీం, ఉపాధ్యక్షుడు షేక్ మోసిన్, సాయి, నిఖిల్, జిల్లా కార్యదర్శి షేక్ సల్మాన్, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'యూఫోరియా–2024' వేడుకలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ భూమిరెడ్డి కాలనీలోని ఫాదర్స్ మోడల్ హైస్కూల్‌లో ఆదివారం 'యుఫోరియా–2024' వార్షిక వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వివేకానంద్ హాజరయ్యారు. పాఠశాల వ్యవస్థాపకుడు, సీనియర్ జర్నలిస్ట్ దివంగత మంతెన లింగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుత బిజీ ప్రపంచంలో తల్లిదండ్రులు తమ ఉద్యోగాలు, పనులకే పరిమితం కాకుండా పిల్లలతో కాస్త సమయం కేటాయించి వారి బాగోగులపై శ్రద్ధ పెట్టి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు


ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందజేసి సత్కరిస్తున్న ఫాదర్స్ మోడల్ హైస్కూల్ యాజమాన్యం

వేయాలన్నారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు బల్వంత్ రెడ్డి, పెద్ది మల్లేశం, మురళీగౌడ్, క్యూఆర్‌ఎస్‌ఎంపీ ఉపాధ్యక్షుడు చింతల మల్లేశం యాదవ్, నారాయణ, ఫాదర్స్ మోడల్ హైస్కూల్ సహ వ్యవస్థాపకురాలు పద్మ మంతెన, కరస్పాండెంట్ రవళిక పతకోటి, డాక్టర్ రవి కిరణ్ మంతెన పాల్గొన్నారు.



గంజాయి విక్రయిస్తున్న ఒకరి రిమాండ్

కుత్బుల్లాపూర్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పేట్ బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎండీ ఫిరోజ్ (42) నగరానికి వలస వచ్చి ధూలపల్లిలోని ప్రశాంత్‌నగర్‌లో నివాసముంటున్నాడు. స్థానికంగా పెయింటింగ్ పనులు చేస్తు జీవనం సాగిస్తున్నాడు. కాగా సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి సరఫరా వృత్తిని ఎంచుకున్నాడు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన గంజాయిని ప్యాకెట్లుగా చేసి పలువురికి విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు ధూలపల్లిలోని స్టీల్ సిటీలో ఈ నెల 28న రాత్రి ఫిరోజ్‌ను అదుపులోకి తీసుకుని 1.95 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

భవనంపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: భవనంపై నుండి దూకి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కొత్తపోచారం గ్రామానికి చెందిన పఠాన్ బియాబాని (54) ధూలపల్లిలోని శ్వేతశుభం అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ డిప్రెషన్‌లో ఉంటున్నాడు. ఆదివారం ఉదయం 6.45 గంటల సమయంలో భవనం ఐదో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన పఠాన్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కరే స్ఫూర్తి

- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్
- ఇందిరమ్మ కాలనీ ఫేజ్–1లో విగ్రహావిష్కరణ



నిజాంపేట్: 'నీకోసం జీవిస్తే నీలోనే నిలిచిపోతావు..అదే జనం కోసం జీవిస్తే జనంలో నిలిచిపోతావన్న' డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాటలే తనకు స్ఫూర్తి అని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఇందిరమ్మ కాలనీ ఫేజ్–1లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేడ్కర్ దూరదృష్టితో రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్–3తో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించగలిగామన్నారు. ఆయన స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని, సమసమాజ స్థాపనకు చేతులు కలపాలని పిలుపునిచ్చారు. నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్ గాజుల సుజాత, నాయకులు చంద్రగిరి సతీశ్, సాంబశివారెడ్డి, భిక్షపతి, ముత్యాలు, జలగం చంద్రయ్య, అంబేడ్కర్ సంఘం గౌరవ అధ్యక్షుడు కుంటపల్లి రమేశ్, దాసరి మల్లేశ్, మధు, ఎర్రోళ్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి దాదిమాల సూరి, దేవరాయ యాదగిరి, దేవరాయ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో తాండ్ర కుమార్ స్మారక క్రికెట్ పోటీలు

మియాపూర్: ఏఐఎఫ్‌డీఎస్ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో జనవరి 6, 7 తేదీల్లో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం గ్రేటర్ కమిటీ కన్వీనర్ తెలిపారు. ఆదివారం కమిటీ సభ్యులతో కలిసి తాండ్ర కుమార్ మెమోరియల్ క్రికెట్ పోటీల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండ్ర కుమార్ మెమోరియల్ క్రికెట్ పోటీలు చందానగర్ పీజేఆర్ స్టేడియంలో జరుగుతాయని పేర్కొన్నారు. ఉ.8 నుంచి సా. 6 గంటల వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ క్రికెట్ పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

పీఏసీ చైర్మన్ గాంధీ


పరీక్షలు చేయించుకుంటున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ హిల్స్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో స్టార్ హాస్పిటల్ సౌజన్యంతో శ్రీ సాయి సత్సంగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి, స్టార్ హాస్పిటల్ డాక్టర్ గూడపాటి రమేష్, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదర్‌నగర్ డివిజన్, హెచ్‌ఎంటీ హిల్స్ కాలనీలో ఎక్కువగా పేద, మధ్య తరగతి ప్రజలు నివసిస్తున్నారని, ఇక్కడి ప్రాంత ప్రజలకు ఇలాంటివి ఎంతో దోహదపడతాయన్నారు. ఉచితంగా రక్త పరీక్షలు, జనరల్, దంత వైద్యం, బీపీ, షుగర్, గైనకాలజీ, ఆర్థో, ఈసీజీ, ఈఎన్‌టీ వంటి సేవలు ఒకే చోట ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.

వైభవంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం


పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వివేకానందనగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ 33వ వార్షికోత్సవాల వేడుకలు అరుణ్ గురుస్వామి కరకమలములచే, ఆలయ చైర్మన్ వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం స్వామివారికి మహన్యాస పారాయణం, శత రుద్రాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. హోమం, నవగ్రహ సహిత నక్షత్ర హవనం, మంత్రపుష్పార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వాములకు అన్న సమారాధన జరిగింది. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం శివ పార్వతుల కల్యాణ మహోత్సవం, సాయంత్రం 6 గంటలకు కూకట్‌పల్లి పురవీధుల్లో అయ్యప్ప స్వామి మహా ఊరేగింపు, 31న ఉదయం 6 గంటలకు లక్ష్మీ గణపతి హోమం, ఆరాట్ ఉత్సవం, 18 కలశాలతో మహా పడిపూజ, అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ చైర్మన్ వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి తెలిపారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్, నిజాంపేట్ రోడ్డులోని కనకదుర్గ ఆలయంలో ఆలయ కమిటీ, కామాక్షి బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం మహిళా భక్తులు లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కుంకుమార్చనలో నిజాంపేట, సమతానగర్, శ్రీనివాసనగర్ సహా పలు ప్రాంతాలకు చెందిన 500 మంది పాల్గొన్నారు. దుర్గా మాత అష్టోత్తర, సహస్రనామావళి నడుమ భక్తి శ్రద్ధలతో కార్యక్రమం జరిగింది. అనంతరం అన్నదాన ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో భువనేశ్వరి మారేపల్లి, కల్యాణి, వెంకటరమణి, బాలపరమేశ్వరి, అచ్యుతకుమారి, జయశ్రీ, ఛాయాదేవి, దుర్గాభవాని, పార్వతి, అనిత, గౌరి, మణి, కామాక్షి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

కూకట్‌పల్లి: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని, బీజేపీ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అంబేడ్కర్ ప్రజా సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కట్టెల మల్లేశం, తెలంగాణ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు దేవుని సతీష్ మాదిగ అన్నారు. బాలానగర్ రాజు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం వివిధ ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ వల్లే ఈ దేశంలో పీడిత వర్గాలకు హక్కులు లభించాయని పేర్కొన్నారు. అటువంటి అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రొగ్రెసివ్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టే ప్రసన్న కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి నర్సింగరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు మోజెస్, జగన్, శంకర్, శ్రీరామ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న వాకర్స్

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని పార్కులో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి కాలనీ సంక్షేమ సంఘం, గుడ్‌మార్నింగ్ వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. నాగిరెడ్డి, రవీందర్, రామకృష్ణ, వాకర్స్ పాల్గొన్నారు.

కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక


ఈనాడు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

కూకట్‌పల్లి: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని ఈనాడు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడు టీఎంకే చౌదరి, సలహాదారులు రాధాకృష్ణల సమక్షంలో అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా భుజంగరావు, కోశాధికారిగా ఉమా శంకర్ రెడ్డి నియమితులయ్యారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462